చెక్కు.. చిక్కు

ముగిసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల గడువు

రాయపోలు(దుబ్బాక): ప్రజాప్రతినిధుల మధ్య అంతరం లబ్ధిదారులకు కొత్త చిక్కు తెచ్చి పెట్టింది. నిరుపేద ఆడకూతురు పెళ్లికి చేదోడువాదోడుగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం ఉద్దేశం బాగానే ఉన్నా పంపిణీలో నిర్లక్ష్యం నెలకొంది. కాలం చెల్లిపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చెక్కులు పంపిణీ చేయడం లేదు. దీంతో రాయపోలు మండలంలో లబ్ధిదారులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. 2014 అక్టోబరు 2వ తేదీన ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో ఆడ కూతురుకు రూ. 51 వేల సాయం అందించేవారు. 2018లో ఆ మొత్తాన్ని రూ.1,00,116 పెంచింది. దివ్యాంగ ఆడబిడ్డలకు రూ.1,25,016 సాయం అందిస్తోంది.

వేర్వేరు పార్టీలు కావడంతో..

దుబ్బాకలో 2019లో జరిగిన ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈ ప్రాంతానికి చెందిన వాడు కావడం.. రానున్న ఎన్నికలో ఆయనే అధికార బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయనుండడంతో దుబ్బాకకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక్కడ జరిగే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా తనకు సమాచారం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏ కార్యక్రమమైనా ఎమ్మెల్యే, ఎంపీని సమన్వయం చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది.

సమయం ఇవ్వని ఎంపీ, ఎమ్మెల్యే..

ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య అధికారులతో పాటు నిరుపేదలు నలిగిపోతున్నారు. ఇందులో భాగంగానే రాయపోలు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు అందజేయాల్సిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఈనెల 30వ తేదీతో కాలం చెల్లిపోయాయి. గతేడాది దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈఏడాది మే 29, 30 తేదీల్లో సాయం మంజూరైంది. చెక్కులు సైతం రాయపోలు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాయి. వీటిని నేరుగా అధికారులే పంపిణీ చేయకుండా అధికారిక కార్యక్రమం ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీని సంప్రదించినట్లు తెలిసింది. ఇద్దరు ఒకేరోజు సమయం ఇవ్వకపోవడంతో వాటి కాలం చెల్లిపోయింది.



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని ఇప్పటికే తీసుకెళ్లాం. రీ వ్యాలిడేషన్‌కు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటివరకు 69 చెక్కుల కాలం చెల్లిపోయింది.

– దివ్య, తహసీల్దార్, రాయపోలు

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించారని, గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా వారు మండలంలోని నకిరెకొమ్ములలో పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు అని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయలని కోరారు. అలాగే తంగళ్లపల్లిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



రామారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రామారంలో మైసమ్మ ఉత్సవాలకు బుధవారం హాజరై మాట్లాడారు. సూరంపల్లి నుంచి నాచారం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు సరిగా లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా కాంట్రాక్టర్, అధికారులతో మాట్లాడి త్వరితగతిన పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రామారం, గొల్లపల్లి తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆయన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యుడు రాజేశ్వరీ గణేష్, మండల కురుమ సంఘం అధ్యక్షుడు గణేష్ బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు.

క్లుప్తంగా

మహిళల రక్షణకే షీటీంలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల రక్షణ కోసమే షీటీంలు పనిచేస్తున్నాయని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ కేజీబీవీలో బాలికలకు బుధవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడటం వల్ల జరిగే పరిణామాలు, సోషల్ మీడియాతో జరిగే నష్టాలు, తదితర వాటి గురించి వివరించారు. సమావేశంలో ఎస్‌ఓ శారద, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలెమ్

హుస్నాబాద్: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ బెన్ షాలెమ్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ నమోదుపై ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధికి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల డివిజన్ ఏర్పాటు కోసం సెప్టెంబర్ 2న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు అందరు సహకరించాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అందె అశోక్, మంచాల చిరంజీవులు, రాము, చందా శ్రీకాంత్, బుట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి'

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట అమలుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రాజనర్సు అన్నారు. బుధవారం 31వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి చెత్త ఏరే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వార్డులో సమస్యల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన దీక్షలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూమిగారి మనోహర మద్దతు తెలిపారు. ఈసందర్భంగా జేఏసీ కో చైర్మన్ ఒగ్గురాజు మాట్లాడుతూ.. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకపోతే అధికార బీఆర్‌ఎస్ నాయకులపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అందె బీరయ్య, పాకల ఇసాక్, రామగళ్ల నరేష్, బందిగ రాకేష్, పుల్లని వేణు, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

సిద్దిపేటరూరల్: తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విజయవంతం చేయడంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. దీక్షలకు ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘు సంఘీభావం తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్‌కు చెందిన విద్యార్థిని ధరావత్ షీలా పై చదువులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇంజినీరింగ్ కోసం ఎదురు చూస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న విషయాన్ని దూల్మిట్ట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా నాయకులు ద్వారా రూ. 30 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

వర్గల్(గజ్వేల్): బీసీ కులాలను సంఘటిత పరుస్తూ హక్కుల సాధన లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమిస్తామని గజ్వేల్ నియోజకవర్గ బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాచారం గుట్టలో బీసీ కులాల ఐక్యవేదిక ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం చైర్మన్ కాముల్ల అయిలయ్య, గజ్వేల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, కుమ్మరి సంఘ జిల్లా నాయకుడు నాగపురి రమేష్, గజ్వేల్ మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు హైదర్ ఎక్బాల్, తదితర నాయకులు కార్యాచరణపై చర్చించారు. ఈసందర్భంగా వర్గల్ బీసీ ఐక్య వేదిక అడహాక్ కమిటీ కన్వీనర్‌గా పసుల లింగం ముదిరాజ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వర్గల్ మండల బీసీ నాయకులు నాగరాజు, సాదుల్లాగౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీరాంనర్సింలు, పైనం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రూప్స్, టెట్, డీఎస్సీకి ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 18 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 45 రోజుల పాటు అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విజ్ఞల జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ తీర్మానాలు సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏకగ్రీవ తీర్మానాలు ప్రజాస్వామ్యానికి విఘాతం అని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు ఓటమి భయంతోనే కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని రంగాల ప్రజలు అభివృద్ధి చెందారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డిని విద్యాశాఖ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సంపూర్ణ సహకారం అందించాలి

సిద్దిపేటజోన్: వివిధ రాజకీయ పార్టీలు ప్రభుత్వ అధికారులకు సంపూర్ణ సహకారం అందించాలని సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు సూచించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ దిలీప్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్, మోహన్‌లాల్ (బీఆర్‌ఎస్), శ్రీనివాస్ (బీజేపీ), ఇమామ్ (కాంగ్రెస్), యాదగిరి(బీఎస్‌పీ), తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం



తీర్మాన ప్రతులను చూపుతున్న పాలకవర్గం

గజ్వేల్: గజ్వేల్ నుంచి మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో గెలిపిస్తామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. గజ్వేల్‌లో ప్రతిపక్షాలకు చోటు లేదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు వీరే..

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక చేపట్టారు. సంగారెడ్డి బెటాలియన్‌కు చెందిన హావిల్దార్ సంతోష్ నింబు, సురేంద్రసింగ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీకి 55 మంది కేడెట్లను ఎంపిక చేసినట్టు కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని తెలిపారు.

'రాఖీ' సందడి

రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాకేంద్రంలోని దుకాణాలు బుధవారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వివిధ రూపాల్లో తయారు చేసిన రాఖీలు రూ. 5 నుంచి రూ. 3 వేలకు పైగా ధర పలికాయి. సోదరులకు రాఖీలు కట్టేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లే వారితో బస్టాండ్లు సందడిగా మారాయి. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు రక్షాబంధన్ గురించి వివరించి రాఖీలు కట్టించారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



హుస్నాబాద్: అధికారులకు రాఖీ కడుతున్న విద్యార్థిని



మిరుదొడ్డి(దుబ్బాక): రాఖీ ఆకారంలో కేజీబీవీ విద్యార్థినులు



గజ్వేల్‌రూరల్: పూసలతో రాఖీ చిత్రాన్ని రూపొందించిన రామకోటి రామరాజు

సెప్టెంబర్ 3న గద్దర్, సాయిచంద్ సంస్మరణ సభ

దుబ్బాకటౌన్: పట్టణంలో సెప్టెంబర్ 3న ప్రజాయుద్ధనౌక గద్దర్, గాయకుడు సాయిచంద్ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్టు దళిత సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం దుబ్బాకలో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో జరిగే ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్, గద్దర్ కూతురు వెన్నెల హాజరువుతున్నారని తెలిపారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరికె శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి ర్యాకం శ్రీరాములు, తదితరులు మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

◆ **కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని పూజలు**

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని మండలంలోని కమలాయపల్లి బీఆర్‌ఎస్ నాయకులు జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిలో బుధవారం ముడుపు కట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఐక్యతతోనే రాజ్యాధికారం**

కోహెడ రూరల్(హుస్నాబాద్): బీసీలు ఐక్యమత్యంతో ఉంటేనే రాజ్యాధికారం సాధించవచ్చని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని తంగళ్లపల్లి, కూరెల్ల, శనిగరం, కోహెడలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

◆ **క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి**

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

◆ **క్షీరాభిషేకం**

బెజ్జంకి(సిద్దిపేట): పూజారులకు రూ. 10 వేల వేతనాన్ని పెంచుతూ ప్రకటన చేసినందుకు గానూ మండల పూజారులు బుధవారం బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసం వెంకటేశంను ఎన్నుకున్నారు.

◆ **మహాధర్నాను జయప్రదం చేయండి**

నంగునూరు(సిద్దిపేట): విద్యా రంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 1వతేదీన తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య పిలుపునిచ్చారు.

◆ **రైతులను ఆదుకోవాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): సరైన వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పత్తి, మక్క రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీసీసీ (కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్) జిల్లా కో ఆర్డినేటర్ సూకూరి ప్రవీణ్ కోరారు. మండల పరిధిలోని అందె గ్రామంలో ఎండు ముఖం పట్టిన పత్తి, మొక్కజొన్న పంటలను బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **పేదల సంక్షేమమే ధ్యేయం**

దుబ్బాక: పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారీ అన్నారు. వంట గ్యాస్ ధరలను తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బుధవారం దుబ్బాక పట్టణంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, రవి, భాను, ప్రవీణ్ కుమార్, నేహల్ గౌడ్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే..**

దౌల్తాబాద్(దుబ్బాక): దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ నాయకుడు దండోరా శివరాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు.

◆ **భూమి పూజ**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఊరచెరువు సమీపంలో గంగాదేవి గుడి నిర్మాణానికి బుధవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ సాంబరాజు, రైతు సమన్వయ కో–ఆర్డినేటర్ కందుల రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే సంక్షేమం**

కొండపాక(గజ్వేల్): సబ్బండ వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ వాసరి లింగారావు అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సిద్ధులు, భాను ప్రకాశ్, సతీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పోచమ్మకు వెండి కిరీటం**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోచమ్మకు ఐలేని కిష్టారెడ్డి స్మారకార్థం ఆయన కుమారుడు రాజు బుధవారం 17 తులాల వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.

◆ **నూతన నియామకం**

కొండపాక(గజ్వేల్): బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా ఎర్రవల్లికి చెందిన ఆకారం అశోక్ నియామకం అయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి నియామకపత్రం అందించారు.

◆ **గజ్వేల్‌లో నేత్రదాన పక్షోత్సవాలు**

గజ్వేల్: గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం 38వ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ.. నేత్రదానం అన్నింటిలో కెల్లా గొప్పదని చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్యులు రాకేష్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

◆ **'అడ్మిషన్లు తీసుకోండి'**

సిద్దిపేటఎడ్యుకేషన్: 2023– 2024 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబర్ 4వ తేదీ వరకు అవకాశం ఉందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు తక్షణమే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

◆ **ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోండి**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమను రెగ్యులరైజేషన్ చేయాలని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకువారి స్వరూపరాణికి వినతిపత్రం అందజేశారు.

◆ **బస్సుల కోసం ఆందోళన**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పోతిరెడ్డిపల్లికి నడిచే బస్సు సర్వీసులు సమయపాలన పాటించాలని బుధవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామం నుంచి పాఠశాలల, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నా రని వాపోయారు.